వరుస వానలతో అన్నదాతల బెంబేలు



రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రులోని చేలల్లో నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా అల్పపీడనం ఏర్పడడంతో గత వారం రోజులుగా విస్తరంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రతి రోజూ ఓ వైపు ఎండ, మరోవైపు వాన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు మండలంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరుకు సుమారు 139.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ముఖ్యంగా కాళీపట్నం, పేరుపాలెం, కేపీ పాలెం, మొగల్తూరు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పాటు పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రులోని చేలల్లో నీరు నిలిచిపోయింది. వర్షానికి తోడు దర్బరేవు డ్రెయిన్ ఆటుపోటులకు డ్రెయిన్ నీరు చేలల్లోకి చేరుతుంది. దీంతో ఆ ప్రాంతపు భూములు కాలువలను తలపిస్తున్నాయి. మరో నాలుగు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

ప్రతి ఏటా సార్వా సాగు సుమారు 3 వేల ఎకరాల్లో చేపట్టేవారు. ఈ ఏడాది కాలువలు సకాలంలో వదిలినా కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్త, చెదారాలు కారణంగా శివారు ప్రాంతాలకు సాగు నీరందలేదు. దీనికి తోడు జూన్, జూలై నెలలో కురిసిన వర్షాల కారణంగా ముందుగా వేసుకున్న ఆకుమడులతో పాటు నాట్లు వేసిన చేలు కూడా ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు సాగు ఆరంభంలోనే నష్టపోవడంతో వరి సాగు కేవలం 640 ఎకరాలకు తగ్గిపోయింది. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి మొగల్తూరు 1, 2, రామన్నపాలెంలోని 1, 2 సచివాలయ పరిధిలోను, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో మాత్రమే చేలు ఊడ్చారు. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో మోకాలు లోతులో నీరుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు తగ్గి, ఎండలు కాస్తే చేలల్లో నిలిచిన నీరు లాగుతుందని రైతులు పేర్కొంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో తుఫాన్ ఏర్పడుతుందని, దీని ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి సాయం అందే పరిస్థితి కనిపించడంలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో? అర్థం కావడంలేదని రైతులు వాపోతున్నారు.

రెండు ఆకుమడులు వేసి నష్టపోయాం



సాగు ఆరంభంలోనే రెండు సార్లు ఆకుమడులు వేసి రెండు సార్లు నష్టపోయా. అకాల వర్షాల కారణంగా ఆకుమడులు మునిగిపోయి రోజులు తరబడి నీరుండటంతో ఆకు పాడైపోయింది. దీంతో ఈఏడాది సాగు చేపట్టకుండా వదిలేశాం.

– పిప్పళ్ల గోపి, రామన్నపాలెం

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతులు

పెనుగొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో మూడు వినతుల అందినట్లు తహసీల్దారు జి.అనిత కుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రెండు వినతులు, పెనుగొండ సీతారాముని చెరువులో మద్యం షాపు తొలగించాలని మరో వినతి అందినట్లు తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

పాలకొల్లు సెంట్రల్: వర్ధంతి లేకుండా జయంతి ఒక్కటే జరుపుకునే ఏకైక స్వాతంత్ర సమరయోధుడు నేతాజి సుభాష్‌చంద్రబోస్ అని హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆజాద్ అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగాంగా ఆజాద్ హింద్ ఫౌజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ నేతాజి 1943 అక్టోబర్ 21న ఆజాద్ హింద్ ఫౌండేషన్ స్థాపించారన్నారు. అనంతరం విద్యార్థులకు సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలను వివరించారు.

దేవస్థానం భూమిలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాద శివాలయం వద్ద దేవస్థానం భూమిలో ఆక్రమణలను అధికారులు సోమవారం తొలగించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి చక్కదిద్దారు. ఇటీవల రుస్తుంబాద ప్రాంతానికి చెందిన మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, చింతా నానాజీలు దేవస్థానం భూమిలో ఓ కంటైనర్ పెట్టి, చిన్న షెడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ పూజారి ఈటకు ఫిర్యాదు చేయడంతో తొలగింపు చేపట్టారు. అయితే తొలగింపును ఆక్రమణదారులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇంతలో వీహెచ్‌పీ నాయకులు అక్కడికి చేరుకుని ఆలయ ఆస్తులు పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగడంతో ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో కలిసి వచ్చి పరిస్థితి చక్కదిద్దారు.

వైభవంగా నడివీధి వేడుక



అమ్మవారిని నడి వీధికి తీసుకువస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక మద్దిరావమ్మ జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారిని నడివీధికి తీసుకుని వచ్చే వేడుక ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రామాలయం కూడలిలో పూరిగుడిసె ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమను నిలబెట్టి పూజలు నిర్వహించారు. ఈ నెల 24 గురువారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే విధుల బహిష్కరిస్తామని ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల యూనియన్ సోమవారం జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎన్‌టీఆర్ వైద్య సేవ కోర్డినేటర్ డాక్టర్ కీర్తికి పలు డిమాండ్‌లతో వినతిపత్రం అందజేశారు. గత 17 ఏళ్లుగా ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో వైద్య మిత్రలు,టీంలీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్ తదితర క్యాడర్‌లో పనిచేయడం జరుగుతుందన్నారు. ఈనెల 27 తేదీ వరకు దశల వారిగా తమ నిరసన తెలియజేసి ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 29 నుంచి విధులు బహిష్కరించి పూర్తి స్థాయి సమ్మె చేపడతామని తెలిపారు.

యనమదుర్రు డ్రెయిన్‌పై అప్రోచ్ రోడ్లు వేయాలి

భీమవరం: పట్టణంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేయాలని సీపీఎం భీమవరం పట్టణ శాఖ మహాసభ తీర్మానించింది. సోమవారం మెంటేవారి తోటలోని పార్టీ కార్యాలయంలో దండు బోయిన త్రిమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు మునిసిపల్ భవనాన్ని వెంటనే పునఃనిర్మించాలని తీర్మానించారు. అనంతరం పట్టణ నూతనశాఖ కార్యదర్శిగా ఎన్ రంగానును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాణసంచా వ్యాపారానికి తాత్కాలిక లైసెన్సులు తీసుకోవాలి

యలమంచిలి: దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాలలో బాణసంచా వ్యాపారం చేయాలనుకునే వ్యాపారులు తాత్కాలిక లైసెన్సు కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేయాలని, దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఒరిజినల్ చలానా, జీఎస్టీ రసీదు జతపరచాలని పేర్కొన్నారు. ఇవన్నీ జతచేసిన దరఖాస్తులను మాత్రమే విచారణ జరిపి లైసెన్సు మంజూరు కోసం నరసాపురం ఆర్డీవో కార్యాలయానికి సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. తాత్కాలిక లైసెన్సు లేకుండా బాణసంచా వ్యాపారం చేయకూడదని, లైసెన్సు లేకుండా బాణసంచా అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మానవత బేబీ కిట్స్ అందజేత

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆచంట ప్రభుత్వాసుపత్రిలో బేబీ కిట్స్ అందించారు. బాలింతలకు బేబీ కిట్స్ అందించడంతో పాటు, పండ్లు, మందులు అందించారు. కార్యక్రమంలో మానవత మండల శాఖ అధ్యక్షుడు కుక్కల లీలా ప్రసాద్, నంబూరి అంజిబాబు, వేంద్ర శ్రీనివాస్, ఉద్దగిరి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నానాజీకి అంతిమ వీడ్కోలు



పెనుగొండలో నానాజీ అంతిమ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



నానాజీ నివాసం వద్ద ఎమ్మెల్సీ రవీంద్ర, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, జగ్గిరెడ్డి తదితరులు

పెనుగొండ: డీసీసీబీ మాజీ డైరెక్టర్, పెనుగొండ సొసైటీ ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మయ్య నాయుడు(నానాజీ) మృతితో పెనుగొండ శోకసంద్రమైంది. సోమవారం నిర్వహించిన అంతిమ యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నానాజీకి నివాళులర్పించారు. మూడు తరాల శాసన సభ్యులు జవ్వాది లక్ష్మయ్యనాయుడు, జవ్వాది శ్రీరంగనాయకులు, కూనపరెడ్డి వీర రాఘవేంద్రరావు (చినబాబు) రాజకీయ వారసుడైన నానాజీ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. దీంతో ఆయన మృతదేహాన్ని సోమవారం ఉదయం 7:30 గంటలకు పెనుగొండకు తీసుకువచ్చారు. అభిమానులు, అన్ని పార్టీల కార్యకర్తలు ఇరగవరం మండలం అయితంపూడి నుంచి పార్థీవదేహాన్ని ర్యాలీగా తీసుకువచ్చి, నానాజీ నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం 1 గంట వరకూ ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, అభిమానులు భారీగా తరలి రావడంతో పెనుగొండ జవ్వాది వారి వీధి కిక్కిరిసిపోయింది.

ప్రముఖుల నివాళి

నానాజీ మృతదేహానికి ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబు, ఆకుల బాబు, ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామిజీ, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పోడూరి గోవర్ధన రామయ్య, నడపన గోవిందరాజులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమైన అంతిమ యాత్ర గంటసేపు జవ్వాది వారివీధి, తేతలి వారి వీధి, చాత్రాది వారి వీధి, పల్లపు వీధుల్లో నిర్వహించారు. వేలాదిగా ప్రజలు తరలి రావడంతో కిక్కిరిసిపోయాయి. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో పాటు పలువురు నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. నానాజీ మృతికి సంతాపం ప్రకటిస్తూ పెనుగొండలో సోమవారం అన్ని వ్యాపార, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు.

వైభవంగా పాశుపతాస్త్ర హోమం

మొగల్తూరు: స్థానిక పడమటిపాలెం శివారు సుబ్రహ్మణేశ్వరంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పాశుపతాస్త్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి సుబ్రహ్మణేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం పూజా కార్యక్రమాలు అనంతరం శ్రీ వల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గుడాల చిట్టిముత్యం-శశిరేఖ, గుడాల సుబ్రహ్మణ్యం- సరస్వతి దంపతులతో పాశుపతాస్త్ర హోమాన్ని పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పల్లి నాగరాజు, గుడాల వెంకటేశ్వరరావు, సానబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు మంగళవారం మేడపాడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడపాడు గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అరట్లకట్టలో

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్టలో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు గ్రామ సచివాలయం వద్ద రీ సర్వే అభ్యంతరాలపై రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జి నరేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ సదస్సులో పాల్గొని ఆర్వో రిజిస్టర్‌లో రైతుల పేర్లు తప్పు, ఒప్పులు, భూమి వివరాలను సక్రమంగా ఉన్నదీ, లేనిదీ సరి చూసుకోవాలని కోరారు. అలాగే అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం, ప్రయాణికుల సూచనలు,సలహాలు కోసం మంగళవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ప్రయాణికులు 99592 25486 నెంబర్‌కు ఫిర్యాదులు, సూచనలను తెలపాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ సిబ్బంది ద్వారా ఏమైనా ఇబ్బందులున్నా, కార్గో సర్వీస్‌లో ఇబ్బందులు, ప్రత్యేక బస్సులు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

భార్యపై భర్త దాడి

భీమవరం: పట్టణంలోని రెండో పట్టణంలోని ఎం.ఆర్ నగర్‌కు చెందిన ఎస్.దేవి భవానిని ఆమె భర్త రామకృష్ణ కొట్టడంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి వివాహమై 10 ఏళ్లు అయ్యిందన్నారు. బాధితురాలు పుట్టింట్లో ఉండగా ఆదివారం వచ్చి కొట్టడంతో గాయపడిందని తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై ఎం.మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చోరీ

భీమవరం: పట్టణంలోని రెండో పట్టణ పరిధిలోని రైల్వే అండర్‌పాస్ సమీపంలో ఉంచిన తన మోటార్ సైకిల్ చోరీకి గురైందని ఉండుద్రుకు చెందిన టి.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈనెల 7వ తేదిన చోరీ జరగగా అప్పటి నుంచి వెతికినా ప్రయోజనం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



మొగల్తూరు: పోలీస్‌స్టేషన్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

మొగల్తూరు: ప్రాణాలకు తెగించి పోలీసులు చూపుతున్న త్యాగం, ధైర్యం ఎప్పటికీ మరువలేమని సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల మహోన్నత త్యాగాన్ని మరువకూడదని సూచించారు. విశ్రాంతి లేకుండా ప్రజల రక్షణ కోసం నిత్యం కష్టపడేది పోలీసులేనని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సై జి.వాసు, ఏఎస్సై రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవారం సోమవారం ఆచంటలో ఘనంగా నిర్వహించారు. ఎస్సై కట్టా వెంకట రమణ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా చూడాలి



అరుంధతీ పేటలో డ్రెయినేజీ పూడిక పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కమిషనర్ 29వ వార్డు అరుందతీపేటలో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ డ్రెయినేజీలను బాగు చేయాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మున్సిపల్ సిబ్బందికి ప్రతిరోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని చెప్పారు. ఆయన వెంట కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ, మున్సిపల్ శానిటరీ అధికారులు ఉన్నారు.

శిథిల భవనాల్లో వ్యాపారాలు వద్దు

శిథిలభవనాల్లో వ్యాపారాలు సాగించవద్దని మున్సిపల్ కమిషనర్ ఎం.అజయ్య హెచ్చరించారు. సోమవారం టాక్సీ స్టాండ్ ఎదురుగా ఉన్న శిథిలభవనం షాపింగ్ కాంప్లెక్స్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. వర్షాలు ఎక్కువగా పడుతున్న దృష్ట్యా భవనం ప్రమాదంలో ఉందన్నారు. ఇలాంటి భవనం వద్ద వ్యాపారాలు చేయవద్దని కోరారు. పట్టణంలో ఇంకా ఇలాంటి భవనాలు క్కడెక్కడ ఉన్నాయో గుర్తించి నివేదిక ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాంటి భవనాలను కూల్చే విధంగా యజమానులకు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. ఆయన వెంట టీపీఎస్ త్రినాథరావు తదితరులు ఉన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జన సురక్ష ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు ఈనెల 15 తేదీ నుంచి జనవరి 15 వరకు మూడు నెలలు పాటు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. జీవితంలో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆ వ్యక్తి కుటుంబానికి భరోసాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు జన సురక్ష బీమా పథకాలను అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరేందుకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఓ జే ఉదయ భాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ నాగేంద్ర ప్రసాద్, డి ఆర్ డి ఎ పి డి ఎం ఎస్ ఎస్. వేణుగోపాల్, డ్వామా పి డి డా. ఏ సి హెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రైల్వే లిఫ్ట్ పనులు



ఆకివీడు రైల్వే స్టేషన్‌లో పునాది దశలో లిఫ్ట్

ఆకివీడు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. లిఫ్ట్ ఏర్పాటుకు నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు మాత్రం పునాదుల్లోనే ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. స్టేషన్‌లోని మొదటి ప్లాట్ ఫారమ్ నుంచి రెండో ప్లాట్ ఫారమ్‌నకు వెళ్లేందుకు వృద్ధులకు, వితంతువులకు, మహిళలకు అనువుగా ఉండేందుకు లిఫ్ట్‌ను రైల్వే శాఖ మంజూరు చేసింది. అయితే ఈ పనులను వేగవంతం చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం నుంచి వచ్చే రైళ్లు మొదటి ప్లాట్ ఫారమ్‌లోనూ, విజయవాడ నుంచి వచ్చే రైళ్లు రెండో ప్లాట్‌ఫారమ్‌లో ఆగుతాయి. అయితే రెండో ప్లాట్ ఫారమ్‌నకు వెళ్లాలంటే ఫైఓవర్ బ్రిడ్జి ఉన్న ప్పటికీ వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లిఫ్ట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డుకు చెరువు కేటాయింపుపై డిసెంట్



కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు ఇవ్వవద్దని డిసెంట్ ఇస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

ఆకివీడు: సుప్రీంకోర్టు నిబంధనలను కాలరాస్తూ పంచాయతీ చెరువును డంపింగ్ యార్డుకు కేటాయించడం సరైన విధానం కాదని కౌన్సిల్‌లోని కొంత మంది సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో సోమవారం అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాకు తీసుకువచ్చిన ఏకైక అంశం స్థానిక కొండయ్య చెరువు ప్రాంతం 6.22 ఎకరాల్ని డంపింగ్ యార్డుకు కేటాయించాలని తీర్మానానికి తీసుకువచ్చారు. పట్టణంలో 7 ఎకరాల భూమిని డంపింగ్ యార్డుకు కేటాయించాలని గతంలో నగర పంచాయతీ జిల్లా కలెక్టర్ లేఖ రాయడంతో, దీనిపై తహసీల్దార్‌ను విచారణ చేసి నివేదిక పంపించాలని కలెక్టర్ ఆదేశించారని, ఆ ప్రకారం తహసీల్దార్ సూచనల మేరకు పట్టణంలోని 6.22 ఎకరాల కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు బదలాయించాలని తీర్మానం ప్రవేశ పెట్టారు. దీనిపై వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు(నాగు) తీవ్రంగా వ్యతిరేకించారు. సుప్రీం కోర్టు ఆదేశాలను భేఖాతరు చేస్తూ తీర్మానం చేయడం సరికాదన్నారు. మంచినీటి చెరువుగా వినియోగించుకోవాల్సిన కొండయ్య చెరువును గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు సరిపడే మంచినీటి వ్యవస్థను మన పూర్వీకులు ముందుగానే గుర్తించి చెరువులుగా కేటాయించారన్నారు. అజెండాలో పొందుపరచిన విధంగా ప్రస్తుతం పట్టణంలో 36,595 మంది జనాభా ఉన్నారనడం అసత్యమని, ప్రస్తుత జనాభా 50 వేలకు పైబడి ఉందన్నారు. రానున్న రోజుల్లో మంచి నీటి సమస్య మరింతగా తలెత్తే అవకాశం ఉందని పండు, నాగు చెప్పారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

చెరువులను చెరువులుగా ఉంచి, డంపింగ్ యార్డుకు ఆక్రమణల్లో ఉన్న భూముల్ని స్వాధీనం చేసుకుని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం, నగర పంచాయతీ పట్టణంలో సెంటు భూమి కొనే పరిస్థితిలో లేదన్నారు. పట్టణ పరిధిలో ఎకరం రూ. కోటి రూపాయల పైబడి ఉందని మంచినీటి చెరువు అవసరాలకు కొత్తగా భూమిని కొనే పరిస్థితి లేదన్నారు. ప్రజాఅవసరాల్ని దృష్టిలో పెట్టుకుని కొండయ్య చెరువును మంచినీటి చెరువుగా అభివృద్ధి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పట్టణ పరిధిలో లెక్కకు మించి భూమి ఆక్రమణల్లో ఉందని, దానిని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డుకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే పెద్ద మనస్సుతో దీర్ఘాలోచన చేయాలని వారు కోరారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, మొహ్మద్ అష్రఫ్ ఉన్నీసా, తిరుమారెడ్డి మాధవి, జనసేన కౌన్సిలర్లు గోపిశెట్టి సత్యవతి, గుర్రాన నాగలక్ష్మి తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వేర్వేరుగా డిసెంట్ ఇచ్చారు. తాము తెలిపిన విధంగానే తీర్మానాన్ని మినిట్స్ పుస్తకంలో రాయాలని సూచించారు. కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు కేటాయింపు పై మిగిలిన సభ్యులు మౌనంగా ఉన్నారు. అనంతరం టీడీపీకి చెందిన కౌన్సిలర్లు, జనసేనకు చెందిన ఒక కౌన్సిలర్ సమావేశం అయిపోయిందని వెళ్లిపోయారు. కమిషనర్ జి.కృష్ణ మోహన్ విలేకర్లతో మాట్లాడుతూ డిసెంట్ ఇచ్చిన కౌన్సిలర్లు మాత్రమే వ్యతిరేకించారని, చైర్‌పర్సన్‌తో పాటు మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు గైర్హాజరయ్యారు.

వీధిలైట్ల సమస్య పరిష్కరించాలని వినతి

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సూరవరపు వెంకటాచార్యులు విద్యుత్ అధికారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలో విద్యుత్ సమస్యతో పాటు లైన్‌మెన్ కొరత వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. మెయిన్ విలేజ్ తోట, ఎస్సీ, బీసీ కాలనీల్లో స్ట్రీట్‌లైట్ కేబుల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయి రెండు నెలలు గడుస్తుందని ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు తెలియపరచినా లైన్‌మెన్ లేడంటూ సమస్య పరిష్కరించడం లేదని వివరించారు. దీనివల్ల వీధిదీపాలు వెలగకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా చర్యలు తీసుకుని కాలిపోయిన కేబుల్ వేయడంతో పాటు లైన్‌మెన్‌ను కేటాయించాలని కోరుతూ ఫిర్యాదు అందజేశారు. ఈ ఫిర్యాదు ప్రతిలో సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు మున్నలూరి సువర్ణలక్ష్మీతో పాటు గ్రామ పంచాయతీ బోర్డు సభ్యులు సంతకం చేశారు.